BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ 15-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు

దీపాదాస్ మున్షి గొప్ప నాయకురాలు

- నిబద్ధత, క్రమశిక్షణ, నిజాయితీ గల వ్యక్తి
- పార్టీని బలోపేతానికి ఎంతో కృషి చేశారు
- ఆమెపై అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు చేపడతాం
- టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

మహా, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జ్ గా పని చేసిన దీపాదాస్ మున్షీ నిబద్ధత, నిజాయితీ, క్రమశిక్షణ గల నాయకురాలు అని, ఆమె పార్టీని బలోపేతం చేయడంలో ఎంతో కృషి చేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. కొన్ని దినపత్రికలు, ప్రసార మాధ్యమాలలో దీపాదాస్ మున్షీ పార్టీ కార్యక్రమాలను నిర్లక్ష్యం చేసారని ప్రచారం చేస్తున్నారని ఇది అవాస్తవమని ఆయన అన్నారు. దీపాదాస్ మున్షీ కేరళ ఏఐసీసీ ఇన్‌చార్జ్ గా ఉంటూ తెలంగాణ లో ఏడాది కాలం పాటు అదనపు బాధ్యతలు నిర్వహించారని, ఏఐసీసీ కొన్ని రాష్ట్రాల ఇన్‌చార్జ్ లను, సంస్థాగత మార్పులను చేస్తూ అందులో భాగంగా తెలంగాణ కు పూర్తి బాధ్యతలతో మీనాక్షి నటరాజన్ ను నియమించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కి కేరళలో పూర్తి బాధ్యతలతో పనిచేయాల్సి ఉన్నందున ఇక్కడ కొత్త నియామకం జరిగిందే తప్ప ఎలాంటి చర్యలు కావని అన్నారు. దీపాదాస్ మున్షీ ప్రియరంజన్ దాస్ మున్షీ సతిమణిగా, పెద్ద రాజకీయ కుటుంబ నేపథ్యం, నీతి, నిజాయితీగా పని చేసిన చరిత్ర ఉందని, పార్టీ ని క్రమశిక్షణగా, సంస్థాగతంగా బలోపేతం చేశారని తెలిపారు. ఆమెపై వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నామని, అలాంటి నిరాధార వార్తలు రాస్తే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

నేడో రేపో మంత్రివర్గ విస్తరణ!

కొత్త మంత్రుల జాబితాకు తుదిరూపు
కాసేపట్లో రాహుల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
కులగణన, ఎస్సీ వర్గీకరణపైనా కీలక చర్చలు జరిగే అవకాశం
రేవంత్ హుటాహుటిన ఢిల్లీ పర్యటనపై సర్వత్రా ఉత్కంఠ

మహా, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు అయినట్లు సమాచారం. నేడో , రేపో విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాసేపట్లో భేటీ కానున్నట్లు సమాచారం. పార్టీ అధిష్టానం పిలుపుతో శుక్రవారం రాత్రి సీఎం హుటాహుటిన ఢిల్లీకి పయనమయ్యారు. వాస్తవానికి సీఎం ఢిల్లీ పర్యటన శుక్రవారం మధ్యాహ్నం వరకు లేదని, మధ్యాహ్నం తరువాత ఖరారు అయినందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో ప్రభుత్వ, పార్టీ కార్యకమాలపై పార్టీ పెద్దలతో చర్చించనున్నట్లుగా సమాచారం. ఇందులో ప్రధానంగా కుల గణన లో పాల్గొనని వారి నుంచి సమాచారాన్ని సేకరించడానికి ఈనెల 16 నుంచి 28 ప్రత్యేక సర్వే, సర్వే పూర్తి అయ్యాక దానికి చట్టబద్ధత కల్పించి దానిని కేంద్రానికి పంపించడం, స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా, పీసీసీ కార్యవర్గం ఖరారు, నామినెటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై చర్చించనున్నట్లుగా తెలిసింది. దీనితో పాటుగా మంత్రివర్గ విస్తరణ అంశం కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని సమాచారం. గతంలో అనేక సందర్భాల్లో సీఎం తో పాటుగా పీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ, ఉత్తమ్ లాంటి వారిలో ఒకరు తప్పనిసరిగా ఢిల్లీ పెద్దలు పిలిపించి మాట్లాడే వారు కానీ ఈ సారి మాత్రం కేవలం సీఎం రేవంత్రెడ్డినే పిలిపించడం ఎంటనే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది.

కొత్త మంత్రుల జాబితా ఖరారు చేసే దిశగా..

ఇప్పటికే తెలంగాణ నుంచి వెళ్లిన కొత్త మంత్రుల జాబితాను చివరిసారిగా పరిశీలించి, సీఎం రేవంత్, రాహుల్ చర్చించికుని తుదిరూపు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇవాల్టి సమావేశంలో రాష్ట్ర మంత్రివర్గంలో ఎవరెవరికి చోటు కల్పించున్నదీ ఖరారయ్యే చాన్స్ ఉంది. ఇక మంత్రివర్గంలో చోటును ఆశించినా దక్కని నిరాశావహులకు రాష్ట్రంలో కీలకమైన కార్పొరేషన్లు, చైర్ పర్సన్లుగా నియమించడం, పీసీసీ రాష్ట్రకార్యవర్గంలో బాధ్యతలు అప్పజెప్పేలా ఏఐసీసీ నిర్ణయం తీసుకోనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

మీనాక్షీ నటరాజన్‌కు కంది శుభాకాంక్షలు

ఆమె పనితీరు అందరికీ ఆదర్శమంటూ కితాబు

మహా, హైదరాబాద్: రాష్ట్ర ఏఐసీసీ ఇన్‌చార్జిగా నియమితులైన మీనాక్షి నటరాజన్‌కు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఆదిలాబాద్ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీనాక్షి నటరాజన్ నియామకం మంచి పరిణామమని అన్నారు. ఆమె అత్యంత నిజాయితీ గల నేత అని, అతి సామాన్య జీవితాన్ని గడుపుతూ అందరికీ ఆదర్శంగా ఉండే నాయకురాలు అని ఆయన పేర్కొన్నారు. ఆమె పనితీరు అందరికీ ఆదర్శమని అన్నారు. మీనాక్షి నటరాజన్ ఇన్‌చార్జిగా రావడం సంతోషంగా ఉందన్నారు. మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఇది వరకు పనిచేసిన దీపాదాస్ మున్షి పార్టీని పటిష్టం చేయడంలో ఎంతో కృషి చేశారని కంది శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు.

మోదీ కులంపై గూగుల్‌లో తెగ సెర్చింగ్

సీఎం రేవంత్ వ్యాఖ్యలతో సర్వత్రా హాట్‌టాపిక్

మహా, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. పీఎం మోదీ కులంపై చేసిన వ్యాఖ్యలు ఓవైపు దుమారం రేపుతుండగా.. మరోవైపు ఇంతకు మోదీది ఏ కులం అంటూ నెటిజన్లు గూగుల్‌లో తెగ సెర్చింగ్ చేస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ మధ్య రాజకీయ రచ్చ నెలకొంది. రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వే చర్చలోకి అనూహ్యంగా రేవంత్ ప్రధాని నరేంద్ర మోదీ కులాన్ని తీసుకురావడంతో చర్చ పూర్తిగా కొత్త మలుపు తీసుకుంది. నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని ఆయన కన్వర్టెట్ బీసీ అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై బీజేపీ భగ్గుమంటుంటే, కాంగ్రెస్ సైతం అంతే స్థాయిలో కౌంటర్లు ఇస్తోంది. రాష్ట్రంలోని కులగణన సర్వేపై విమర్శలు, ప్రతివిమర్శలతో సాగిన వార్ ఇప్పుడు నరేంద్ర మోదీ కులం చుట్టూ తిరుగుతోంది. ఈ క్రమంలో మోదీ కులం ఏంటి? రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా 2001 సంవత్సరంలో అసలేం జరిగింది? అంటూ నెటిజన్లు ఇంటర్నెట్‌లో తెగ సెర్చ్ చేస్తున్నారు.

మోదీ కులం ఏదంటే..

నరేంద్ర మోదీ 'తెలి' కులానికి చెందిన వ్యక్తి. ఆ కులంలో చాలా ఉపకులాలు ఉన్నాయి. అందులో ఒకటైన మోఢ్ ఘాంచి కులానికి చెందినవారు మోదీ. అయితే 1999 అక్టోబర్ లో వాజ్ పెయి ప్రభుత్వం ఓబీసీ జాబితాలో 23వ ఎంట్రీలో 'ఘాంచి (ముస్లిం), తెలి, మోఢ్ ఘాంచి, తెలిసాహు, తెలిరాథోడ్, తెలిరాథోర్' కులాలను చేర్చగా, గుజరాత్ ప్రభుత్వం 2000 ఏప్రిల్ 4న 'తెలి', 'మోఢ్ ఘాంచి', 'తెలి సాహు', 'తెలి రాథోడ్' 'తెలి రాథోర్' కులాలను బీసీల జాబితాలో చేర్చింది.

రేవంత్.. నోరుజారితే ఊరుకోం

- మోదీతో పెట్టుకున్నోళ్లంతా ఏమయ్యారో చూస్కో..
- బీజేపీ ఎంపీ డీకే అరుణ ఘాటు వ్యాఖ్యలు

మహా, మహాబూబ్‌నగర్: బీజేపీ ఎంపీ డీకే అరుణ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా ఉండి ప్రధాని మోదీ కులం గురించి మాట్లాడడానికి సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సామాజికవర్గం గురించి మాట్లాడే స్థాయి నీకెక్కడిది, సీఎంకు మతి తప్పింది.. అందుకే ఇలాంటి మాటలు మాట్లాడుతున్నారని డీకే అరుణ అన్నారు. మరోసారి నోరు జారితే ఊరుకోమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీతో పెట్టుకున్న అరవింద్ కేజ్రీవాల్ , కేసీఆర్ ఏమయ్యారో చూసుకో రేవంత్ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎవరి మెప్పు కోసం ఆ మాటలు మాట్లాడుతున్నారో చెప్పాలని డీకే అరుణ అన్నారు. రేవంత్ ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నానని అనుకుంటున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ పాలిటిక్స్ లో దుమారాన్ని రేపుతున్నాయి. ప్రధాని బీసీ కాదని.. ఆయనో కన్వర్టెడ్ బీసీ అంటూ కామెంట్ చేశారు. 2002 వరకు ఉన్నత వర్గాల్లో మోడీ ఉండేవారని.. ఆయన సీఎం అయ్యాక తన కులాన్ని బీసీల్లో కలిపారని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ప్రధాని కులం గురించి ఆషామాషీగా చెప్పడం లేదని అన్నారు. పూర్తి ఎంక్వైరీ చేశాకే మాట్లాడుతున్నానని సీఎం రేవంత్ వ్యాఖ్యానించిన విషయం విదితమే.

మేడారంలో భక్తజన సందోహం

మహా, ములుగు: మేడారం జాతరలో శనివారం భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు జంపన్న వాగులో స్నానాలు ఆచరించి గద్దెల వద్దకు చేరుకున్నారు. సమ్మక్క, సారమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇప్పటికే లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.